క్లుప్తంగా...

నేడు చలో ఇందిరాపార్కు

శంషాబాద్: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన కోసం టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద గురువారం చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు దేవేందర్, రాజేంద్రనగర్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సుదర్శన్, నర్సింహా ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లా, మండల స్థాయిలో అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులను గురువారం (నేడు) ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభిస్తారని మణికొండ మున్సిపల్ కమిషనర్ ఫల్గుణ్‌కుమార్ తెలిపారు. వెంకటేశ్వరకాలనీలో రూ. 2కోట్లతో సీసీ రోడ్ల పనులు, ఫ్రెండ్స్ కాలనీలో రూ. 50 లక్షలతో పార్కు అభివృద్ధి, చిత్రపురి కాలనీలో బస్తీ దవాఖానా ప్రారంభం, మున్సిపల్ కార్యాయ ఆవరణలో రూ.30 లక్షలతో డ్రైవర్ కమ్ ఓనర్ పద్ధతిలో కొనుగోలు చేసిన 15 చెత్త ఆటోలను ప్రారంభిస్తారన్నారు.

విద్యుత్ స్తంభం తొలగింపు

మణికొండ: దశాబ్దాల క్రితం వేసిన ఇనుప విద్యుత్ స్తంభం తరచూ షాక్ కొడుతుండటంతో బుధవారం దాన్ని తొలగించారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లిలో ప్రమాదకరంగా మారిన ఓ విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని విద్యుత్ అధికారులతో పాటు మున్సిపాలిటీ పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని కాంగ్రెస్ నాయకుడు ప్రదీప్ కుమార్ ఆరోపించారు.

తొండుపల్లి చెరువు ఎఫ్‌టీఎల్‌ను పరిరక్షించాలి


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వై.కుమార్, శ్రీకాంత్


శంషాబాద్: మున్సిపాలిటీలోని తొండుపల్లి చెరువు ఎఫ్‌టీఎల్‌ను పరిరక్షించాలని పట్టణ కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నేతలు బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుపతిరావుకు ఫిర్యాదు చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించి హద్దులు నిర్ణయించాలని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదన్నారు. వినతి ఇచ్చిన వారిలో వై.కుమార్, శ్రీకాంత్‌యాదవ్, తాజ్‌బాబా, మురళి, అంజద్ ఉన్నారు.

ధోబీ కాంట్రాక్ట్‌లు రజకులకే కేటాయించాలి


మాట్లాడుతున్న సంఘం నాయకులు

బండ్లగూడ: ప్రభుత్వ కార్యాలయాల్లో ధోబీ కాంట్రాక్ట్‌లు రజకులకే కేటాయించాలని రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు గోపి రజక అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హైదర్షాకోట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రత్యేక జీవోను తీసుకొచ్చి ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, రైల్వే నిలయం, యూనివర్సిటీలోని హాస్టళ్లు, పోలీస్ అకాడమీ తదితర కార్యాలయాల్లో ధోబీ కాంట్రాక్టులు రజకులకే కేటాయించేలా చర్యలు తీసుకుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధికి సరికొత్త చికిత్స విధానం



చికిత్సా విధానం సూచించే చిత్రం

రాయదుర్గం: మధుమేహ వ్యాధి కోసం సరికొత్త చికిత్స విధానాన్ని అభివృద్ధి చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఎస్పైర్ బయోనెస్ట్ ఇంక్యుబేటర్‌లోని స్టార్టప్ సంస్థ 'రీజెన్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' ఆధ్వర్యంలో ఈ సరికొత్త చికిత్స విధానాన్ని రూపొందించారు. రోగి చిన్నపేగు ద్వారా డైటరీ గ్లూకోజ్‌ను గ్రహించడాన్ని నిరోధించడం ద్వారా గ్లూకోజ్ స్థాయిలు తగ్గుతాయని, తద్వారా డయాబెటీస్ నిరోధించబడుతుందని రీజెన్ ఇన్నోవేషన్ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం వంగల, రీజెన్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఉదయ్ సక్సేనాలు తెలిపారు. టైప్-2 వ్యాధిగ్రస్తుల్లో రక్తంలో గ్లూకోజ్‌ను తగ్గించడానికి ఈ కొత్త విధానం తోడ్పడుతుందన్నారు.

సోలార్ డ్రైయింగ్‌పై విద్యార్థులకు శిక్షణ


శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఉద్యాన పంటల ఉత్పత్తులలో విలువల జోడింపు కోసం డీహైడ్రేషన్(పంట ఉత్పత్తులను ఎండబెట్టుట) టెక్నాలజీ పై గత మూడ్రోజులుగా శిక్షణ తరగతులను నిర్వహించారు. బుధవారం ముగింపు సందర్భంగా విద్యార్థులకు ధ్రువ పత్రాలను అందించారు.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ చీనా నాయక్ విద్యార్థులకు శిక్షణలో నేర్పిన విషయాల గురించి వివరించారు. వివిధ ఉద్యాన పంటలైన పండ్లు, కూరగాయలు, పూలు, పంట ఉత్పత్తులను కోసిన తర్వాత సోలార్ డ్రైయింగ్ (ఎండబెట్టుట) విధానంలో చేపట్టాల్సిన పద్ధతుల గురించి విద్యార్థులకు ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించినట్లు తెలిపారు. కోసిన పంట ఉత్పత్తులలో ఉన్న తేమను సరైన విధానంలో ఆరబెడితే మంచి ఉప ఉత్పత్తులైన మాంగో జెల్లీ, రాగి మాల్ట్, తాండ్రల వంటివి తయారు చేయవచ్చని వివరించారు. ప్రధానంగా అనేక పోషక విలువలు ఉన్న మునగ ఆకులను ఈ సోలార్ డ్రైయింగ్ పద్ధతిలో ఎండపెట్టడంతో చాలా కాలం నాణ్యతగా నిల్వ ఉంచుకోవచ్చునన్నారు. సాధారణంగా కోసిన తర్వాత పంటలలో ఉన్న తేమ శాతాన్ని బట్టి పదార్థాలు నిల్వ చేసుకోవచ్చని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. పండ్లు, ఆకు కూరగాయలను సరైన సోలార్ డ్రైయింగ్ పద్ధతిలో ఎండపెట్టటం వలన వచ్చే పొడి ఉత్పత్తులను చాలా కాలం నిల్వ ఉంచుకుని అవసరమైనప్పుడు కూరలు, పాలలో కలుపుకొని తీసుకోవడంతో పోషకాలు అందుతాయన్నారు. దీంతోపాటు విద్యార్థులు సొంతంగా ఆహార పరిశ్రమలలో ఎంట్రెప్రెనేటర్‌గా ఎదగాలనుకునే వారు సరైన విధంగా లైసెన్స్‌లను పొంది పరిశ్రలను ఏర్పాటు చేసుకొని ఎదగాలన్నారు. పూలను ఎండపెట్టిన తర్వాత ఎన్నో విధాలుగా అలంకారాలుగా తయారు చేసుకోవచ్చని వివరించారు.ప్రధానంగా విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త సాంకేతిక పద్ధతులను తెలుసుకొని తదనుగుణంగా ఆచరించాలని ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా పది మందికి ఉద్యోగావకాశాలను కల్పించేలా ఉద్యాన పరిశ్రమలను స్థాపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కిరణ్‌కుమార్, డాక్టర్ గీర్వాణి, డాక్టర్ నటరాజన్, శ్రీనివాసన్, పూల పరిశోధన శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రశాంత్, పిడిగాం సైదయ్య,అశ్వన్ కుమార్ పాల్గొన్నారు.

'కంటివెలుగు'తో ఎంతో మేలు


కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన నరేందర్

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం వార్డుల వారీగా ఏర్పాటు చేస్తున్న ఉచిత కంటి వెలుగు కేంద్రాలతో అందరికీ ఎంతో మేలు జరుగుతుందని మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీహాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం మనం తీసుకుంటున్న ఆహారంలో సమతుల్యత లేకపోవటంతో అనేక రోగాలు వస్తున్నాయని, అందులో కంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అలాంటి వాటిని సకాలంలో గుర్తించి మందులు వాడటం, కంటి అద్దాలను పెట్టుకుంటే కొంత వరకు కంటి సమస్యలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ బీఎస్‌కే రమేష్, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, మాజీ సర్పంచ్ యాలాల నరేష్, మెడికల్ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కిస్మత్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో..

బండ్లగూడ: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని 9వ డివిజన్ కార్పొరేటర్ నిఖిల సంగారెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కిస్మత్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమం నిరుపేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, నిపుణులైన వైద్యుల బృందం కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రశాంత్ నాయక్ నాయకులు సంగారెడ్డి, జగదీష్, వైద్య బృందం పాల్గొన్నారు.


కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న నిఖిల సంగారెడ్డి, ప్రశాంత్ నాయక్

వ్యాలెట్ పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలి

మణికొండ : దుకాణాల ముందు సరైన పార్కింగ్ ఉండాలని, రోడ్లపై వాహనాలను నిలిపితే చర్యలు తప్పవని నార్సింగి ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. నిబంధనలు పాటించని దుకాణానికి బుధవారం నోటీసులు జారీచేసినట్లు సీఐ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. నార్సింగి రోటరీ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు షాపుల ముందు సరిపడ పార్కింగ్ స్థలం ఉంటే అందులో ఏర్పాటు చేసుకోవాలని, లేని వారు వ్యాలెట్ పార్కింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి 11.30, సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రోడ్డు పక్కన నిలిపే వాహనాలను సీజ్ చేస్తామని, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన షాపుల యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


ఓ దుకాణ యజమానికి నోటీసు అందజేస్తున్న దృశ్యం

25 వేలమంది నిరుద్యోగులకు శిక్షణ

యాకుత్‌పురా: 2023–24వ విద్యా సంవత్సరంలో 25 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని సెట్విన్ శిక్షణ సంస్థ ఎండీ వేణుగోపాల్ రావు తెలిపారు. పురానీహవేలీలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ... గత ఏడాది సంస్థ కేంద్రాలతో పాటు ఫ్రాంచైజీలలో మొత్తం 16,490 మంది విద్యార్థులు శిక్షణ పొందారన్నారు. నగరం, జిల్లాలోని 24 శిక్షణ కేంద్రాలతో పాటు ఆన్‌లైన్‌లో సైతం 57 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రసుత్తం ఉన్న 45 కోర్సులతోపాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. నామమాత్రపు రుసుముతో సెట్విన్ అందిస్తున్న కోర్సుల్లో ఆసక్తిగల అభ్యర్థులు మోతీగల్లీ, ముషీరాబాద్, తార్నాక, యూసూఫ్‌గూడ, ఈస్ట్ మారేడ్‌పల్లి, ఏసీ గార్డ్స్, చైతన్యపురి, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్, రియాసత్‌నగర్, మీరాలం ట్యాంక్, ఈదీబజార్, పురానీ హవేలి, నెరేడ్‌మెట్, విద్యానగర్, మలక్‌పేట్, రసూల్‌పురా, ఎన్‌బీటీ నగర్, ఎర్రగడ్డ, అంబర్‌నగర్, సీతఫల్‌మండీ శిక్షణా కేంద్రాలలో సంప్రదించాలన్నారు.


చెక్కులను అందజేస్తున్న అధికారులు, నాయకులు

చెక్కుల అందజేత

మణికొండ: పేదలను అన్ని విధాలుగా ఆదుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని గండిపేట తహసీల్దార్ రాజశేఖర్ అన్నారు. బుధవారం గండిపేటలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో 39 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన మేయర్ మహేందర్‌గౌడ్, చైర్‌పర్సన్ డి. రేఖ యాదగిరిలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల వివాహాలకు అప్పులు కావొద్దనే ఉద్దేశంతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్, కౌన్సిలర్లు ప్రవీణ్‌కుమార్, గోపాల సునీత, విజిత ప్రశాంత్ యాదవ్, అరుణజ్యోతి, కార్పొరేటర్ సాగర్‌గౌడ్ పాల్గొన్నారు.

లాలమ్మగార్డెన్‌లో పేలిన కెమికల్ డబ్బాలు

వ్యక్తికి గాయాలు, ఆస్పత్రికి తరలింపు


గాయాలకు గురైన రాంనాథ్ రాజేంద్ర


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అనిల్‌కుమార్

మణికొండ: చెత్త కుప్పలో ఉన్న కెమికల్ డబ్బాల కోసం వచ్చిన ఓ వ్యక్తి వాటిని తీసుకుంటుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలడంతో సదరు వ్యక్తికి గాయాలయ్యాయి. భారీ శబ్దం రావడంతో పరిసరావాసులు బాంబు పేలిందేమోనని భయభ్రాంతులకు గురయ్యారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని లాలమ్మగార్డన్‌లో బుధవారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటన అందరినీ ఉరుకులు పరుగులు పెట్టించింది. కాలనీలోని ఓ ఖాళీ ప్లాట్‌లో చెత్తా, చెదారం వేస్తున్నారు. అందులో చెత్త ఏరుకునేందుకు వచ్చిన రాంనాథ్ రాజేంద్ర అనే వ్యక్తి అందులో ఉన్న ఖళీ కెమికల్ డబ్బాలను తీసుకునేందుకు కదలించారు.అంతే ఒక్కసారిగా అవి పెద్ద శబ్దాలు చేస్తూ పేలడంతో రాజేంద్ర ఛాతీ, ముఖానికి గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం ఇవ్వటంతో మున్సిపాలిటీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బంది నీటి ట్యాంకర్‌ను తెచ్చి మంటలను ఆర్పారు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న నార్సింగి ఎస్సై అనిల్‌కుమార్ స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎఫ్ఆర్‌పీ కెమికల్ మెటీరియల్ డబ్బాలు అక్కడ ఉండటం, ఎండ వేడికి అవి పేలి ఉంటాయని నిర్ధారించారు. కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గాయాలకు గురైన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు.

బూత్‌స్థాయి నుంచే పార్టీని బలపర్చాలి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని ప్రతి పోలింగ్ బూత్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలను బలోపేతం చేస్తూ బీజేపీని పటిష్ఠ పర్చాలని రంగారెడ్డి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ సూచించారు. రాజేంద్రనగర్ డివిజన్ పార్టీ అధ్యక్షులు జి.బాబురావు ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు మరింత కష్టపడి పనిచేయాలని సూచించారు. పార్టీ బలోపేతం కోసం అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాల్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, హరిషన్, జి.పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సందీప్ ముదిరాజ్, సురేందర్, శ్రీనివాస్ రెడ్డి, విఠల్, మల్లేష్, శ్రీరామ్, స్వప్న రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

వీఆర్‌ఏ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలి


ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏ జాక్ నాయకులు

వీఆర్‌ఏ జాక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల వీఆర్‌ఏ జాక్ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. క్యాబినెట్ సమావేశంలో తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వివరించాలని కోరారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా వీఆర్‌ఏ ప్రధాన కార్యదర్శి నరసింహ, ఉపాధ్యక్షులు జానకీ రాము మాట్లాడుతూ.. గతంలో 84 రోజుల సమ్మె చేసిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలిచి కేటీఆర్ పే స్కేలు అమలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇలా రాష్ట్ర ప్రభుత్వం చర్చల పేరుతో ఇప్పటికి మూడుసార్లు పిలిచి మాట్లాడి హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. పీఆర్సీ బెనిఫిట్స్ అర్హులైన వారందరికి ప్రమోషన్స్ కల్పిస్తామని.. 55 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. సమ్మె కాలంలో 84 రోజుల వేతనం వెంటనే చెల్లిస్తామని వెల్లడించారని కానీ ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. ఈ సమస్యలను క్యాబినెట్ సమావేశంలో లేవనెత్తి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కలిసి విన్నవించినట్లు తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో మల్లేష్ యాదవ్, రాజు, యాదయ్య, రామకృష్ణ, అంజయ్య, కృష్ణ, పాండు, మహేందర్, ప్రసాద్, దేవేందర్, కుమార్, రుద్ర కుమార్, మల్లేష్, వెంకటయ్య, పార్వతీ, స్వామి, భాస్కర్ పాల్గొన్నారు.

పనుల్లో జాప్యాన్ని సహించేది లేదు

గోల్కొండ: అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని సహించేది లేదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్‌తో కలిసి నానల్‌నగర్ డివిజన్‌లోని సాలార్జంగ్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలను వివరించారు. కాలనీ రోడ్లపై ప్రతినిత్యం డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని ఫిర్యాదు చేశారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలి

గచ్చిబౌలి: ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా కొండాపూర్ రోడ్డు మూసివేతతో మూడు రోజులుగా ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు నానా ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలిసిందే. మంగళవారం రాత్రి సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఐటీ కారిడార్‌లోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సరళిని పరిశీలించారు. గచ్చిబౌలి జంక్షన్, క్యూ మార్ట్, రాడిసన్ హోటల్, ఐకియా గేట్‌నెంబర్ వన్, మైండ్ స్పేస్ జంక్షన్, సైబర్ టవర్స్‌ను పరిశీలించారు. పోలీసులు అందుబాటులో ఉండి ట్రాఫిక్ సమస్య తలెత్త కుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ నారాయణ నాయక్, ట్రాఫిక్ డీసీసీ హర్షవర్ధన్, మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, ఏడీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాస్ రెడ్డి, మాదాపూర్ ఏసీపీ రఘునందన్ రావు తదితరులు పాల్గొన్నారు.


ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో విజయవంతంగా టెలీ మెడిసిన్

గోల్కొండ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరుగుతున్న టెలీ మెడిసిన్ కార్యక్రమం వల్ల రోగులకు మరింత మెరుగైన సలహాలు, సూచనలు అందుతున్నాయని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్ ఉల్లా అన్నారు. బుధవారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో టెలీమెడిసిన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బస్తీ దవాఖానా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన ఆరోగ్యాధికారి, నర్సులు అక్కడికి వచ్చే వ్యాధులు, వారికి అందించాల్సిన మందులపై తమ అనుమానాలు నివృత్తిచేసుకుని సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ కూడా ఉంటారని, ఎప్పటికప్పుడు రోగులకు ఇవ్వాల్సిన మందులు ఆన్‌లైన్‌లో సూచిస్తారన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ సయ్యద్ హైదర్ తదితరులున్నారు.

అనారోగ్య సమస్యలకు రక్తపోటు మూలం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ


బొటానికల్ గార్డెన్‌లో ఆటోమెటిక్ బీపీ చెకప్ మిషన్‌పై బీపీ పరీక్షించుకుంటున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: ఆధునిక జీవన శైలి వల్ల రక్తపోటుకు గురయ్యే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోందని, అదే అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా బుధవారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో హోలిస్టిక్ హస్పిటల్ ఏర్పాటు చేసిన ఆటోమెటిక్ బీపీ చెకప్ మిషన్‌ను అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిత్యం వ్యాయామం, యోగా చేయడం, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండటంతోపాటు జీవన శైలిలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎప్పటికప్పుడు బీపీ పరీక్ష చేయించుకుంటే సరైన వైద్యం చేయించుకునేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ కార్డియాలజిస్ట్ దయాసాగర్, హోలిస్టిక్ హస్పిటల్ చైర్మన్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రంగనాథుడి రథోత్సవం

జియాగూడ: జియాగూడ రంగనాథస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామివారి రథోత్సవం కన్నుల పండువగా కొనసాగింది. దేవాలయం నుండి ప్రారంభమైన రథం ఊరేగింపు రంగనాథనగర్, కంచర బస్తీ, భీమ్‌నగర్, లక్ష్మీనర్సింహనగర్, వెంకటేశ్వర నగర్, ఇక్బాల్ గంజ్ మీదుగా పురానాపూల్ చేరుకుని తిరిగి ఆలయానికి చేరుకుంది. ఊరేగింపు రహదారిలో పలుచోట్ల స్వాగత వేదికల ద్వారా పూల వర్షం కురిపించారు. కేరళ సింగాడి మేళం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ చైర్మన్ చారి తదితరులు పాల్గొన్నారు.



బీజేపీకి ఇక తిరుగులేదు

పార్టీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్

రాయదుర్గం: బీజేపీకి శేరిలింగంపల్లిలో ఇక తిరుగులేదని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ అన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఎన్టీఆర్ కాలనీలో బీజేపీ గిరిజన మోర్చా రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు హన్మంతునాయక్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాదయాత్రలతో బీజేపీ మరింత బలోపేతం కావడంతో పాటు, నూతన చేరికలతో పార్టీ పటిష్ఠంగా మారిందన్నారు. బీజేపీ, దాని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసినప్పుడే పార్టీ విజయం సాధ్యమవుతుందన్నారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ, గచ్చిబౌలి డివిజన్‌లో బీజేపీ పటిష్ఠంగా ఉందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ గెలుపే లక్ష్యంగా సమష్టిగా కృషి చేస్తారన్నారు. రవికుమార్‌యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వసంత కుమార్ యాదవ్, వరలక్ష్మి, విఠల్, శివసింగ్, తిరుపతి, కిషన్, రంగస్వామి, శ్రీరాములు, నర్సింగ్‌నాయక్, సుబ్రహ్మణ్యం, కృష్ణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్‌నగర్‌లో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రవికుమార్‌యాదవ్, గంగాధర్‌రెడ్డి